విచ్చలవిడిగా ఫ్లెక్సీల ఏర్పాటు

- లోపించిన పారదర్శకత
- మంత్రి మాటలు నీటి మూటలేనా..?
- ప్రతిపక్ష నేతలకే నిబంధనలు
- అధికార పార్టీ నేతలకైతే నో రూల్స్



క్లాక్ టవర్ వద్ద ఇలా..

నెల్లూరు(బారకాసు): అనధికారికంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయొద్దు.. అనుమతించిన ప్రదేశాల్లోనే ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తరచూ చెప్తుంటారు. అయితే ఇది కేవలం మాటలకే పరిమితమవుతోంది. క్షేత్రస్థాయిలో చూస్తే నగరం మొత్తం ఫ్లెక్సీలమయంగా మారుతోంది. ప్రధాన కూడళ్లతో పాటు ఆయా రోడ్ల పక్కన ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలను యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నారు. కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండానే ఈ రకంగా కొందరు వ్యవహరిస్తున్నారు.

కార్యక్రమం ఏదైనా ఫ్లెక్సీయే..!

నగరపాలక సంస్థ పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు తదితరుల పుట్టినరోజు వేడుకలు, కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు.. స్వాగత తోరణాలను ఏర్పాటు చేయడం పరిపాటిగా మారుతోంది. వీటి ఏర్పాటు, తొలగించేందుకు యంత్రాంగపరంగా ఒక విధానమంటూ లేకుండా పోయింది. అనుమతి ఉన్న ప్రదేశాలు, బోర్డులపైనే ఏర్పాటు చేయాలనే నిబంధనను తుంగలో తొక్కుతున్నారు. ప్రధాన రహదారుల మొదలుకొని.. బహిరంగ ప్రదేశాలు.. చిన్న వీధులను సైతం వదలకుండా వీటిని ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులను గురిచేస్తున్నారు.

తొలగించేవారేరీ..?

నగరంలో అనుమతి లేని ప్రదేశాలు, స్థలాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినా తొలగించే నాథుడే కరువయ్యారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేస్తూ మినీబైపాస్‌లోని ఎంపీ వీపీఆర్ నివాసం వద్ద ఇబ్బడిముబ్బడిగా కట్టిన ఫ్లెక్సీలు రోజుల తరబడి అక్కడే ఉన్నాయి. నగరంలోని పాత చెక్‌పోస్ట్ సమీపంలో, మైపాడు గేట్ సెంటర్.. ఇలా నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో విచ్చలవిడిగా వీటిని ఏర్పాటు చేశారు.

మంత్రి ఆదేశాలు బేఖాతర్

నగరంలో అనధికారికంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే వాటిని వెంటనే తొలగించాలని కార్పొరేషన్ అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద అంటించిన పోస్టర్లను తొలగించే ప్రక్రియను స్వయంగా ఆయనే చేపట్టారు. నగరాన్ని పోస్టర్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలనేదే తన లక్ష్యమని ఆయన ప్రకటించారు. తన ఫ్లెక్సీలు ఉన్నా, వెంటనే తొలగించాలని హుకుం జారీ చేశారు. అయినా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు.

విపక్షాలకే నిబంధనలు

నగరపాలక సంస్థ పరిధిలో విపక్షాల ఫ్లెక్సీలను కక్షగట్టి మరీ తొలగిస్తున్నారు. వీటిని ఒకట్రెండు రోజులకు మించి ఉండనీయడంలేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలకు సంబంధించి అనధికారికంగా ఏర్పాటు చేసినా, ఆ వైపు కన్నెత్తి చూడటంలేదు. మరోవైపు కొంత మంది యువత తమ స్నేహితుల జన్మదినాల సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నా, ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇలా నిబంధనలను ఉల్లంఘించి ఏర్పాటు చేస్తుండటంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మరోవైపు ఫ్లెక్సీలతో ప్రమాదాలతో పాటు శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో అనుమతివ్వకూడదని గతంలో అధికారులు నిర్ణయించారు. అయితే కొంతకాలంగా ఈ నిబంధనను పక్కనబెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో రోడ్డు మొత్తాన్ని ఆక్రమించిన ఫ్లెక్సీ

ట్రాఫిక్ ఐల్యాండ్లనూ వదిలిపెట్టరా..?

ప్రధాన రహదారుల్లోని ట్రాఫిక్ ఐల్యాండ్‌లకు ఫ్లెక్సీలు కట్టడం ఇటీవలి కాలంలో పరిపాటిగా మారుతోంది. ఫలితంగా మహానేతల విగ్రహాలు కనిపించకుండాపోతున్నాయి. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టి సారించి అనధికార ఫ్లెక్సీలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఎంపీ వీపీఆర్ నివాసం వద్ద రోడ్డుపై యథేచ్ఛగా..



రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఎదుట

మౌలిక వసతులను మెరుగుపర్చండి



అధికారులకు సూచనలు చేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయ ప్రాంగణాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చి, లబ్ధిదారులకు గృహాలను అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. అల్లీపురంలోని గృహ సముదాయ ప్రాంగణాన్ని గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గృహాల్లో నివాసం ఉంటున్న వారి అవసరం మేరకు నీటి సరఫరాను పెంచాలని సూచించారు. విద్యుద్దీపాలను ఏర్పాటు చేసి, రాత్రి వేళ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రాంగణం మొత్తం రికార్డయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు. గృహ సముదాయాల్లో నూతనంగా చేరి పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులను స్థానిక సచివాలయానికి అనుసంధానం చేయాలని సూచించారు. పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. హెల్త్ ఆఫీసర్ చైతన్య, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- పౌర సేవలకు సంబంధించి మెరుగైన పనితీరును కార్యదర్శులు కనబర్చాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని 12 / 1 మేకలవారితోట, 2 / 2 నేతాజీనగర్ సచివాలయాలను తనిఖీ చేసిన అనంతరం కార్యదర్శులతో ఆయన మాట్లాడారు. సచివాలయాల పరిధిలోని టిడ్కో గృహ లబ్ధిదారులు గృహ ప్రవేశాలు జరిపేలా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. టిడ్కో గృహ సముదాయాలకు సచివాలయాలను కేటాయించి అక్కడి ప్రజలకు అన్ని పౌర సేవలందేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. 12 / 1 సచివాలయ శానిటేషన్ కార్యదర్శి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో షోకాజ్ నోటీస్‌ను జారీ చేయాలని చెప్పారు.
- కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. 11వ డివిజన్ రామ్‌జీనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పాయింట్ వద్ద ఉన్న చెత్తను తొలగించకపోవడంతో సంబంధిత శానిటేషన్ కార్యదర్శికి షోకాజ్ నోటీస్‌ను జారీ చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనులను ఈ కేంద్రం నుంచి రోజూ పర్యవేక్షిస్తానని, పాయింట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు.

నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా గురువారం నిర్వహించారు. ఉభయకర్తలుగా మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి శివప్రసాద్ తదితరులు వ్యవహరించారు.

లైఫ్ సర్టిఫికెట్ సెంటర్ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు తమ జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్లను ట్రెజరీ కార్యాలయాల్లో ఫిబ్రవరి 28లోపు అందజేసి, మార్చి నుంచి పింఛన్‌ను పొందాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్సెమ్ గౌస్ పేర్కొన్నారు. భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంఘ భవనంలో పింఛనర్ల లైఫ్ సర్టిఫికెట్ సెంటర్‌ను డివిజనల్ సబ్ ట్రెజరీ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి అహ్మద్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్వీపీఎస్ మూర్తితో కలిసి గురువారం ప్రారంభించారు. అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనాథ్, ఉపాధ్యక్షులు వీరేంద్రనాథ్, గోపాల్, ఖాజారసూల్, కార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్, సంయుక్త కార్యదర్శులు సుబ్బారావు, దామోదరం, కోటిరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను విస్మరించిన ప్రభుత్వాలు



నెల్లూరు సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను విస్మరించాయని ఏపీ చేనేత కార్మిక సంఘ రాష్ట్ర సీనియర్ నేత పముజల దశరథరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి హరి పేర్కొన్నారు. సౌత్ మోపూరులోని దశరథరామయ్య నివాసంలో నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చేనేత కార్మికుల హక్కుల సాధన కోసం ఎంతో శ్రమించి వాటిని కాపాడుకుంటున్నామని చెప్పారు. పముజల వనజాక్షమ్మ, గౌరవాధ్యక్షుడు చల్లా నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య, కార్యవర్గ సభ్యులు నారాయణ, రాజశేఖర్, లక్ష్మీనరసయ్య, అప్పారావు, పులి జనార్దన్, మన్నెం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని నగరంలోని రంగనాథస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్డీఓ అనూష పేర్కొన్నారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వామివారిని భక్తులు శీఘ్రంగా దర్శించుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రత్యేక దర్శనం రూ.50, వైకుంఠ ఏకాదశి ప్రత్యేక దర్శన టికెట్‌ను రూ.200గా నిర్ణయించారు. తొలుత ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సభ్యులు వీరేపల్లి పద్మజ, వేలూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో నామమాత్రపు పనులు



డీఆర్వోకు వినతిపత్రమిస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు రూరల్: ఉదయగిరి నియోజకవర్గంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన చెరువుల అభివృద్ధి పనులు నామమాత్రంగా జరుగుతున్నాయని బీజేపీ నేత మిడతల రమేష్ ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్లో డీఆర్వో ఉదయభాస్కర్‌కు వినతి పత్రాన్ని గురువారం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం సత్ఫలితాలను ఇచ్చేలా చూడాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు(అర్బన్): ఆకుతోట సమీపంలోని వైవీ లయన్స్ భవనంలో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాన్ని నెల్లూరు లయన్స్ క్లబ్, లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా ప్రియ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. చీదెళ్ల హరినారాయణ ఆర్థిక సహకారంతో అందజేసిన నూతన ఐ కేర్ పరికరాలను ఆవిష్కరించారు. లయన్స్ మల్టిపుల్ డిస్ట్రిక్ట్ – 316 విజన్ కోఆర్డినేటర్ విజయభాస్కర్‌రెడ్డి, లయన్స్ డిస్ట్రిక్ట్ – 316 గవర్నర్ గోపాలకృష్ణ, పూర్వ జిల్లా గవర్నర్ బయ్యా రవికుమార్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మారుతిప్రసాద్, చంద్రశేఖర్, కోశాధికారి శ్రీనివాసులు, అమృతవల్లి, సురేష్, మురళీకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బాలాజీరావు తదితరులు

నెల్లూరు (టౌన్): నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన క్యాలెండర్, కాజ్యువల్ లీవ్ పుస్తకాన్ని డీఈఓ బాలాజీరావు చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. ఏడీ ప్రసన్నలక్ష్మి, ఆర్టీఏ జిల్లా అధ్యక్షుడు ఖాజారహంతుల్లా, ప్రధాన కార్యదర్శి కిరణ్, మహిళా కార్యదర్శి మాలిని తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని నగరంలోని కిలారి తిరుపతినాయుడు కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా మాజీ వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి వ్యవహరించి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. పూర్వ గవర్నర్ శ్రీనివాసులురెడ్డి, బాసం శేషగిరిరావు, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపీనాథ్, మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, కేపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను గురువారం లెక్కించారు. గతేడాది సెప్టెంబర్ 13 నుంచి గురువారం వరకు కానుకల రూపంలో భక్తులు రూ.10,17,459ను సమర్పించారని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. పూడిపర్తిలోని రామలింగేశ్వరస్వామి దేవస్థాన ఈఓ శ్రీధర్‌నాయుడు పర్యవేక్షించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న అధికారులు

నెల్లూరు (టౌన్): కేజీబీవీల ప్రిన్సిపల్స్, గణిత, ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్ట్‌లను బోధించే ఉపాధ్యాయులకు పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) శిక్షణను దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య మాట్లాడారు. జిల్లాలో గతంలో 72 పాల్ ల్యాబ్‌లు ఉండగా, అదనంగా మరో 33ను మంజూరు చేశారని వివరించారు. అనంతరం ఒక్కో కేజీబీవీకి 30 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఎంఈఓ మురళీధర్, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఏఎంఓ సుధీర్‌బాబు, కేజీబీవీ కోఆర్డినేటర్ మమత, నోడల్ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి వెంకటలక్ష్మమ్మను నగరంలోని ఆమె కార్యాలయంలో బీసీ స్టడీ సర్కిల్ సిబ్బంది మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. స్టడీ సర్కిల్‌ను త్వరలో పరిశీలిస్తానని ఆమె చెప్పారు.

హైందవ శంఖారావ సభకు తరలిరండి

నెల్లూరు రూరల్: ఎన్టీఆర్ జిల్లా గన్నవరంలో ఆదివారం నిర్వహించనున్న హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. దేవాలయాలపై రాజకీయ జోక్యం మితిమీరుతోందని చెప్పారు. సభకు తరలివచ్చి, హిందూ ధర్మ పరిరక్షణకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

బెల్టు నిర్వాహకురాలి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): బెల్టు దుకాణాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు – 1 అధికారులు దాడులను గురువారం చేపట్టారు. వైఎస్సార్ నగర్‌లో బెల్టు షాపును నిర్వహిస్తున్న దర్గామిట్ట రామ్‌నగర్‌కు చెందిన అన్నపూర్ణను అరెస్ట్ చేశారు. ఆమె నుంచి 11 క్వార్టర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు రమేష్‌బాబు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను ఏడులోపు అందజేయాలి

నెల్లూరు (టౌన్): పాఠశాల విద్య గుంటూరు కార్యాలయంలో ప్రభుత్వ విద్యా కార్యక్రమాల సమన్వయం, నిరంతర పర్యవేక్షణ నిమిత్తం తాత్కాలికంగా పని చేసేందుకు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈ నెల ఏడులోపు అందజేయాలని సూచించారు.

డైరీ ఆవిష్కరణ



నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ డైరీని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆవిష్కరించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, ఉద్యోగ సంఘ ఉపాధ్యక్షుడు లక్కాకుల పెంచలయ్య, జిల్లా కార్యదర్శి ప్రసన్నకుమార్, కార్యవర్గ సభ్యులు షాకీర్ అహ్మద్, రమేష్‌బాబు, రామ్మోహన్‌రావు, పవన్‌కుమార్, రవి, రమేష్, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీనియర్ న్యాయవాది మృతి



శివశంకర్‌యాదవ్ (ఫైల్)

నెల్లూరు (లీగల్): మూలాపేటకు చెందిన సీనియర్ న్యాయవాది దేవరాల శివశంకర్‌యాదవ్ (65) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ తదితరులు సంతాపం తెలియజేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో గల వివిధ ప్రాంతాలు, టిడ్కో గృహ సముదాయ ప్రాంగణంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. ఇంటింటి చెత్త సేకరణ, కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు, దోమల మందు పిచికారీ తదితర పనులను చేపట్టారు.

సీపీఐ నేతల నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని నారాయణరెడ్డిపేటలో గల ఉర్దూ స్కూల్ వీధిలో రోడ్డు అధ్వానంగా మారిందని, దీంతో విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు షానవాజ్ పేర్కొన్నారు. గుంతలమయంగా మారిన రోడ్డు వద్ద గురువారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో సిమెంట్ రోడ్డును నిర్మిస్తామని ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. రోడ్డు, సైడ్ కాలువల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, సమస్యను పరిష్కరించకపోతే స్థానికులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నాను చేపడతామని స్పష్టం చేశారు. నేతలు వెంకటేశ్వర్లు, అంకయ్య, ముత్యాలు, చెంగమ్మ, సుబ్బరాయుడు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పగల్‌పత్తు ఉత్సవాలు



కోదండరామావతారంలో రంగడు

నెల్లూరు(బృందావనం): అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని వైష్ణవాలయాల్లో పగల్‌పత్తు ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు కోదండరామావతారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తగా అనుమాలశెట్టి నారాయణరావు వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సభ్యులు వేలూరు శ్రీనివాసులు, బల్లవోలు రమణయ్య, వీరేపల్లి పద్మజ తదితరులు పర్యవేక్షించారు.



వైకుంఠనాథన్ అలంకారంలో వేణుగోపాలుడు

- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు వైకుంఠనాథన్ అవతారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పేరూరు రాజ్యలక్ష్మి, సునీల్‌కుమార్ వ్యవహరించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ నేతలు గురువారం నివాళులర్పించారు. నగరంలోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, సురేష్‌బాబు, శ్రీనివాసులురెడ్డి, ఫయాజ్, సంజయ్, నరసాపురం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.